# అడ్రస్ లేని నీతి!

## నర్సోత్తమ్



గాలిలో నత్రజని, కార్బన్‌డ యాక్సైడులా అవినీతి ఎక్కడ లేదో అని వెతికితే ప్రపంచం అంతా నిండి ఉంది!

కారాకిల్లీ నమిలే కాకారాయుళ్లు, పనిచేయని కబుర్లపోతులు, ఆకాశాన్ని అరిచేతిలో చూపించే అవకాశవాదులు, వంచనే ప్రణాళికగా స్వార్థమే పరమార్థంగా, తామరతంపరగా జెండాలు పట్టుకుని ఊరేగుతుంటే, తేరగా ఊరికే వచ్చే సంపాదన మరిగిన అజేయ అరివీరులు వీరవిహారం చేస్తుంటే, నీతి ఎక్కడుంటుంది? ఎక్కడో నక్కి బిక్క చచ్చిపోయివుంటుంది. మిగిలిన ఒక్క శాతం మీకు కనిపించను అని సిగ్గుతో చచ్చి వాపోయింది! దివ్వె పెట్టి వెతికినా అడ్రసులేని అనాథ అయిపోయింది నీతి! ప్రకృతిలో అంతర్థానమయిపోయింది!

ఓటర్లను తళుకుబెళుకు వాగ్దానాలతో చిత్తు కాయితాల్లా కొంటూ, తళ తళ మెరిసే కత్తులతో గుండెలు విలవిల్లాడేలాగా తుపాకిమెన్‌తో బెదిరించే గుండాయిజం ఎడం చేతిలోనూ, అధికారం లేక అధికారుల అండ ఒక చేతిలోనూ, బాంబులూ సైకిలు చైన్లు, కత్తులు, కటారులు ఆయుధాలుగా 'రిగ్గింగు' అనే సంస్కృతిని విడిచిపెట్టకుండా, ప్రజల్ని కాటేసి అయినా కుర్చీని ఆక్రమించుకుంటున్న రాజకీయ మన్యులు దేశాన్ని అమ్మేసి అయినా ఖర్చు పెట్టిన సొమ్ము రాబట్టుకోటమే గాకుండా కోటీశ్వరులయి వ్యాపారాలు చేస్తున్నారు. లేదా ఇతర దేశాల బ్యాంకుల్లో రహస్య నిధులు పెంచుకుంటున్నారు! ఎక్కువ వానబడి వరదలొచ్చినా, వానలు పడక ఎండిపోయినా, అధికంగా పండి రైతుకు గిట్టుబాటు ధర రాకపోయినా కేంద్రానిదే బాధ్యత! శాంతి భద్రతలను అంతం చేసి, కేంద్రబలగాలతో ప్రజల్ని కాల్పిస్తున్నారు. ఎక్కడ ఏం జరిగినా ఎదుటివాడి మీదకి బాధ్యత నెట్టడమే గదండీ నేడు రాజకీయమంటే!

అత్తారింటిదగ్గర వరకట్నం అనే మంటల్లో ఆడబడుచులు అగ్గిబుగ్గి అవుతూంటే చూస్తూ ఊరుకుందాం! ప్రేమ, పెళ్లి పేరిట ఇల్లు వదలిన ఆడబడుచులు ఎడ్రసులు బొంబాయి, దుబాయిల్లో! పుట్టింది ఆడపిల్ల అయితే అబ్బాయిలు పుటా ్టలి అనే మోజులో ఆడదాన్ని అరగదీసి కుంగదీసే ఈ రోజుల్లో, చదువుకోటానికి గాని, బ్రతకటానికి బయటకు తిరగాల్సి వచ్చినప్పుడు తేనెలా కల్లబొల్లి కబుర్లతో కారులా సాగిపోయే షికారు జీవితాన్ని వరల్డ్ మేప్‌లా ముందుంచి వంచించే స్థితులు ఎదురయితే, అప్పుడయినా, ఇంత జరుగుతున్నా స్త్రీజాతి ఎదురు తిరిగితే ఈ సమాజమే బాగుపడుతుందా? లేక ఈ సమాజమే అంతరిస్తుందా?

భయంకర మహమ్మారి సందు సందుకి ఇంటింటిలోనూ, తాగుడు రూపంలో ప్రత్యక్షమై కరాళ కదన నాట్యం చేస్తుంటే, ఎన్ని జీవితాలో, కుటుంబాలో పసిపిల్లలు, వృద్ధులు సైతం ఫలి తంగా బలైపోతుంటే, యుగాలుగా ఎన్ని కోట్ల మంగళసూత్రాలు బుగ్గయిపోయాయో, గుర్రం ఎక్కితే ఒంటి మీద డ్రస్సు, ఎడ్రసు తెలీని విధంగా విశ్వరూపాన్ని పగలబడి నవ్వుతూ చూస్తూవుంటే, ఆపేదెవరు? "సారా మానండి" అని గట్టిగా చట్టరూపంగా అరుస్తూ 'బ్రాందీ కొట్టండోయ్' అని ఇంకో ప్రక్క లైసెన్సులు ఇస్తూ, ప్రభుత్వం వ్యాపారం చేస్తుంటే, "మీరు తాగి తందానాలాడుకుని తన్నుకుని మా దగ్గరకు రండి. తీర్పు చెబుతాం!" అని కళ్లు మూసేసుకుంటే, సారా నీరులా దొరుకుతుంటే, ఇరవై నాలుగ్గంటలూ దానికే సంపాదనంతా తగలేసి ఇంటికొచ్చి పెళ్లాన్ని అడ్డం వచ్చిన వాళ్లని తన్ని, పిల్లల చదువుల పీకలు పిసికి, ఎవడన్నా రిపోర్టిస్తే, "సంసారం గొడవలు మాకెందుకు" అని పోలీసులు వాళ్ళని వదిలేస్తుంటే, తాగుడు తైతక్క డాన్సు

చేయడా? కౌన్సిలింగులు కాయితాలికి, ఫోటోలు పేపర్లో వేయించుకోవటం వరకు మాత్రమే!

తనకు కావల్సిన పని... తనకు అనుకూలంగా తను అనుకున్న సమయంలో... సాధించుకోవాలంటే... ఒక అధికారి... రాజకీయనాయకుని, అండవుంటే మీకు కావాల్సినవన్నీ అంగడిలో సామాన్లే! స్వార్థం విషం. చిమ్ముతుంటే, నీక్కావలసినవి నీచేతి సంచిలోకి వస్తాయి! నీ ఇంటి ముందు నిలబడతాయి! అవినీతి అంగాంగ ప్రదర్శన నగ్న నాట్యం అందం విందులు చేస్తుంది గదూ!

విషజ్వరం, సంధిప్రేలాపనంతో నీతి మంచానికతుక్కుపోయింది! నేడో రేపో అన్నట్టుంది. తులసి తీర్థం ఆఖరిసారిగా పోసి చేతులు దులుపుకుంటారో, కాల్చి బూడిద చేసి గంగలో కలిపి దాన్ని కూడా కలుషితం చేస్తారో!


ప్రతి పెళ్లి రిజిస్టరు చేసి వియ్యంకులిద్దరి దగ్గరా కట్నం ఇవ్వటంలేదు, తీసుకోవటం లేదు అని బంధువుల సాక్షులుగా సంతకాలు చేయించి పెళ్లిళ్ల జరిపిస్తే! అప్పటికీ మార్గాంతరాలు వెతికితే, ఆస్తులు జప్తులకంగీకారం మీద తీసుకుంటే, అప్పటికయినా వరకట్నం పిశాచం నుండి విముక్తి లభిస్తుందేమో! ఆడపిల్లను మోసం చేసినా, అల్లరి చేసినా అన్యాయం చేసినా, మహిళా న్యాయం సంఘాలకు అత్యున్నత అధికారాలుండి తీరాలి! అప్పుడైనా గాంధీ కన్న కల నిజమవుతుందేమో!

ఇకపోతే సారా, బ్రాందీలు మనుషుల్లో ఉండే బలహీనతకు నిదర్శనాలు! అవి గుండాయిజానికి ఆయుధాలు! సారాబాబు అయినా, బ్రాందీ బాబయినా, ఆ సమయంలో గర్వంతో కిక్ ఎక్కి... ఎదుటివాణ్ణి బలహీనుడిగా చూస్తాడు. మందు కొట్టినప్పుడు మాట్లాడేవన్నీ నిత్యసత్యాలు అని అపోహ... కానీ, ఆ సమయంలో ప్రత్యర్థి మీద కక్ష, పగతోనే మాట్లాడుతాడు.

దానికి బానిసయి సంసారాలు విచ్ఛిత్తి చేసుకునేవారికి, ఆడవాళ్ళు చీపుళ్లతో నలుగురిలో నిలబెట్టి... మొగుడయినా సరే... ఉతికిన నాడు మార్పు వస్తుందా? లివర్ దెబ్బతింది, చస్తాను అని తెలిసి కూడా అప్పుడు గూడ వచ్చేది శక్తిగాదు, చేరేది మృత్యువు ఒడి అని గ్రహించేదెప్పుడో!

ఇవన్నీ ఒకదాన్నంటిస్తే వెలిగే ఇంకో దివ్వెలా సమాజానికి?!

ఈ అంటు జాఢ్యాలన్నింటికి మందు ... ముందుగ్గా స్వార్థాన్ని విడాలి! అపుడే... అవినీతి... అన్నీ అంతరించిపోతాయి!



### అతితెలివి

*ఇటీవల జూనియర్ జీతూ కూడా పెదవ్విప్పి మాట్లాడ్డం మొదలు పెట్టాడు. "గ్రేసీ సింగ్ లో గొప్ప గ్రేస్ వుంది. ముఖ్యంగా ఆమెతో నటిస్తుంటే ఎంతో రియలిస్టిగ్గా వుంటుంది. ఎక్కడా కృతకత్వం దగ్గరకు రానివ్వదు" అంటూ పొగడ్తలు మొదలు పెట్టాడు.*

*గ్రేసీ "తుషార్ మంచి యంగ్ డైనమిక్ హీరో" అంటోందిగాని తన దృష్టి అంతా టాలీవుడ్ మీదే వుంది. (అదే టాక్టీసంటే!)*




**ప్రియదత్త 2వ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా ఇవే మా శుభాకాంక్షలు** టి. మల్లేశం న్యూస్‌పేపర్ ఏజెంట్, వరంగల్. మావద్ద ప్రియదత్త, ఆటవిడుపు, అభిసారిక మొ॥లగు మేగజైన్స్ లభించును. సంప్రదించగలరు :

**T. Mallesham, Newspaper Agent**
**Vegetable Market Street, WARANGAL - 506 002.**
**Ph : 562 887 (O), 323 229 (R)**

మా వద్ద ప్రియదత్త, ఆటవిడుపు, ఇండియా టుడే మొ॥లగు పత్రికలు లభించును. సంప్రదించగలరు :



**B. Rajendrababu (News Agent)**
**STD & Kirana Shop**
**H. No. 1-4-50, Shikay Corner, Opp : Surya Kala Mandir, Mahaboobabad**
**WARANGAL - 506 106**



మా వద్ద ప్రియదత్త, ఆటవిడుపు, సుప్రభాతం మొ॥లగు పత్రికలు లభించును. అలాగే వివాహాది శుభకార్యములకు **Balaji Tent House** ను సంప్రదించగలరు :

**V. Krishna Gupta, V. V. Gupta News Agency, Main Road,**
**CHOWTUPPAL, Nalgonda - Dist - 508 252. Ph : 72664**

Advt